సాక్షి
కుమురం భీం

శుక్రవారం : 30 : జూన్ : 2023



ఘనంగా బక్రీద్

జిల్లా వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకొన్నారు. వివిధ ప్రాంతాల్లో మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 8లో▸



తొలి ఏకాదశి పూజలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పండరినాథ్ ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా గురువారం అర్చకులు అనంత్ ఆచార్య ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.4 /27.5

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి ఐకే రెడ్డి



భీంరావు విగ్రహాన్ని పరిశీలిస్తున్న మంత్రి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభాస్థలిని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు. గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కుతో కలిసి సభావేదిక, పిల్లల పార్క్, పార్కింగ్ ఏరియా, హెలీప్యాడ్, కలెక్టరేట్ వద్ద పనులను పర్యవేక్షించారు. రూట్‌మ్యాప్, బందోబస్తుపై అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ హేమంత్ బోర్కడేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సాయిచంద్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి ఐకే రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అకాల మరణంపై రాష్ట్ర మంత్రి ఐకే రెడ్డి సంతాపం తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కుతో కలిసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో గాయకుడిగా సాయిచంద్ ప్రజలను చైతన్యవంతులను చేశారని గుర్తు చేశారు. జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ప్రతీ అధికారి అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సీఎం పర్యటనకు సంబంధించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా అన్నిశాఖల అధికారులు ఉదయం 9.45 గంటల వరకు తమకు కేటాయించిన కార్యాలయ గదుల్లో అందుబాటులో ఉండాలన్నారు. భద్రత కట్టుదిట్టంగా ఉండడంతో అధికారులు ఇచ్చిన సమయానికి ముందుగానే తమ కార్యాలయ గదులకు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశం, ఆర్డీవో రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'వందే భారత్' ట్రయల్ రన్



కాగజ్‌నగర్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్

కాగజ్‌నగర్‌టౌన్: చెన్నై– న్యూఢిల్లీ ప్రధాన రైల్వే లైన్‌లో ఉన్న కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ మీదుగా గురువారం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయన్ రన్ కొనసాగింది. సికింద్రాబాద్– నాగ్‌పూర్‌కు మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపించేందుకు రైల్వే శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు కేవలం 5, 6 గంటల్లో చేరుకునే అవకాశాలు ఉన్నందున ప్రయాణికులు ఈ రైలు ప్రారంభం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైలు ఉన్నా 9 నుంచి 10 గంటల సమయం పడుతోంది. ఈ విషయంపై కాగజ్‌నగర్ రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాష్‌ను సంప్రదించగా, ఉన్నతాధికారుల సూచనల మేరకు వందే భారత్ రైలు ట్రయల్ రన్ జరుగుతోందని వివరించారు.

అన్నింటా వెనుకే..

ఆశలన్నీ కేసీఆర్ పైనే!

- ఆమడం దూరంలో జిల్లా ప్రగతి
- గిరిజన గ్రామాలకు నేటికీ రహదారుల్లేవు..
- మౌలిక వసతులకు నోచుకోని గ్రామాలెన్నో?
- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పీడిస్తున్న వైద్యుల కొరత
- సగం పల్లెలకూ మిషన్ భగీరథ నీరందని దుస్థితి



రాళ్లతో అధ్వానంగా తిర్యాణి మండలం గోవెన గ్రామానికి వెళ్లే దారి

సాక్షి, ఆసిఫాబాద్: దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాగా పేరుగాంచిన కుమురం భీం ఆసిఫాబాద్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ కరుణ చూపాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్న ఘనతను మూటగట్టుకున్న సీఎం కేసీఆర్ గిరిజన జిల్లాపై కొంత మమకారం చూపితే ప్రగతి రథచక్రాలు పట్టాలెక్కుతాయని వారు ఆశిస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాలు నేటికీ సరైన రహదారి సౌకర్యాలకు నోచుకోకపోవడం.. జిల్లా కేంద్రంలో ఒక్క సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు కాలేదంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలని వేడుకుంటున్నారు. నేడు జిల్లాకు విచ్చేస్తున్న సీఎం వరాల జల్లు కురిపిస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

కలగానే వసతుల కల్పన

జిల్లాలో మౌలిక వసతుల కల్పన కలగానే మిగిలిపోయింది. మిషన్ భగీరథ పథకం ఉన్నా లేనట్టే. సగం పల్లెలకు నీరందడం లేదు. ఆసిఫాబాద్ పట్టణంలోనూ అదేతీరు ఉండడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక జిల్లాలో వైద్యం అందని ద్రాక్షగానే ఉంది. ప్రభుత్వ ఆస్పత్రికి ఎవరైనా ప్రసవానికి వస్తే నర్సులే వారి పాలిట దేవుళ్లు. ఎందుకంటే ఇక్కడ గైనకాలజీ డాక్టర్ లేరు. ఆపరేషన్ అంటే అదెవరు చేస్తారు? అన్న ప్రశ్న తలెత్తుతోంది. తాజాగా మూడు వందల పడకల ఆసుపత్రిగా రూపాంతరం చెందుతున్న ఈ ఆస్పత్రికి సరిపడా వైద్యులు లేకపోవడం గమనార్హం. జిల్లాలో అనేక సాగునీటి ప్రాజెక్టులున్నప్పటికీ రైతాంగానికి ఒక్క ఎకరాకు నీరందని దుస్థితి. ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయినా.. కాల్వల నిర్మాణాలు పూర్తి చేయకపోవడమే ఇందుకు కారణం.

పరిశ్రమల జాడేది..

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి ఇసుమంతైనా కనిపించదు. నూతనంగా ఒక్క చిన్నతరహా పరిశ్రమ జిల్లాలో ఏర్పాటు కాకపోవడమే ఇందుకు నిదర్శనం. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలు లేకపోవడంతో ప్రైవేటు కళాశాల వైపు విద్యార్థులు చూడాల్సిన పరిస్థితి.

రోడ్ల పరిస్థితి అధ్వానం..

జిల్లాలో 432 గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ లేదు. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి లింక్ రోడ్లు లేవు. గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు అటకెక్కాయి. వీటి కోసం గతంలో అధికారులు రూ.57 కోట్లతో అంచనాలు రూపొందించగా.. ప్రభుత్వం కేవలం రూ.25 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకొంది. దీంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. తిర్యాణి, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్, జైనూర్, గాదిగూడ, ఆసిఫాబాద్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికీ సగానికి పైగా గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పరిస్థితికి అద్దం పడుతోంది. భారీ వర్షాలు పడితే మారుమూల గూడేల్లోని ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. తిర్యాణి మండలంలోని ఎక్కువగా గ్రామాలు రిజర్వు ఫారెస్ట్‌కి దగ్గర ఉండటంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనా ఫారెస్ట్ క్లియరెన్స్ లభించడం లేదు.

సాగునీటి ప్రాజెక్టులు..

జిల్లాలో వట్టివాగు, కుమురంభీం వంటి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించినా కాలువల నిర్మాణాలు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం.. చేపట్టిన వాటికి నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. ఆయకట్టుకు సాగునీరు అందించే పరిస్థితి లేదు. దీంతో రైతులు వర్షాధార పంటలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. వీటికి మరమ్మతులకు సరిపడా నిధులు కేటాయిస్తేనే వాటి లక్ష్యం నెరవేరుతుంది. వార్ధా నదిపై బ్యారేజీ నిర్మాణానికి అడుగులు ముందుకు పడటం లేదు.



వట్టివాగు ప్రాజెక్టు

వంతెనల నిర్మాణం..



అసంపూర్తిగా ఆసిఫాబాద్ మండలంలోని గుండి వంతెన

జిల్లాలో చాలా వంతెనలు నిర్మాణ దశలోనే ఉండిపోయాయి. కొన్నింటి పనులు నత్తను మరిపిస్తుండగా.. మరికొన్ని పనులు మొదలేకాలేదు. గుండి వంతెన 15 ఏళ్ల కిందట ప్రారంభించారు. ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఉబ్రి, ఎర్రవాగులపై వంతెన పనులూ అంతే.

వైద్య ఆరోగ్య శాఖకు ఖాళీల రోగం

జిల్లాలో 24 పీహెచ్‌సీలు, సామాజిక ఆసుపత్రులు, 108 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటినీ వైద్యసేవల కొరత పీడిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో 110 వైద్యాధికారుల పోస్టులు ఉండాల్సి ఉండగా.. 76 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన అన్ని కేటగిరీల సిబ్బంది పోస్టులు 306 ఖాళీలు ఉండడం గమనార్హం. ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంతోపాటు ఏజెన్సీ, మైదానం తేడా లేకుండా రోగాలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నా ఖాళీల భర్తీకి యంత్రాంగం చొరవ చూపడం లేదు. ప్రధానంగా జిల్లాలో గిరిజన గూడేలు అత్యధికంగా ఉన్నాయి. ఇక్క డ వైద్య సేవలు కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఏజెన్సీలో మొత్తం 15 పీహెచ్‌సీల పరిధిలో 35 వైద్యుల పోస్టులకు తొమ్మిది మంది డాక్టర్లు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన 26 పోస్టులు భర్తీకి నోచుకోలేదు.

తీరిన 'పోడు' గోస !

- సీఎం కేసీఆర్ చేతులమీదుగా పంపిణీ
- నేడు ఆసిఫాబాద్‌లో లబ్ధిదారులకు పట్టాలు అందజేత
- అన్ని నియోజకవర్గాల్లో ఇచ్చేందుకు ఏర్పాట్లు



ఉమ్మడి జిల్లాలో పోడు పట్టాల వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	ఎకరాలు
కుమురంభీం	15,254	44,750
ఆదిలాబాద్	12,222	31,683
నిర్మల్	7,257	20,051
మంచిర్యాల	2,403	5,024

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోడు గోస తీరింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏళ్లుగా అర్హులైన వారికి పట్టాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం పట్టాలు ఇస్తుండడంతో అటవీ భూములు సాగు చేసుకునేందుకు చట్టపరమైన హక్కులు దక్కనున్నాయి. శుక్రవారం సీఎం కే.చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు అందనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోడు సాగుదారులు ఉన్నారు. ప్రతియేటా వర్షాకాలంలో అటవీ అధికారులు, సాగుదారులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడేది. అటవీభూములు సాగు చేస్తున్న వారిలో గిరిజన, గిరిజనేతరులు ఉన్నారు. వీరందరికీ పట్టాలు ఇవ్వాలనే డిమాండ్లు వచ్చాయి. చివరగా అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. అప్పట్లో కొంతమంది పట్టాలు రాలేదనే కారణంగా మళ్లీ సర్వే చేసి అర్హులను గుర్తించాలని వినతులు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పోడు పట్టాలు ఇస్తామని ప్రకటించారు. ఆ హామీ మేరకు గత రెండేళ్లుగా లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ జరిగింది. తాజాగా ఎంపిక చేసిన అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు అందిస్తోంది. పోడు పట్టాలు ఇచ్చిన వెంటనే వారికి రైతుబంధు వర్తింపజేసేందుకు బ్యాంకు ఖాతా నంబర్లు తీసుకుని, పెట్టుబడి సాయం అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొదట ఈ నెల 24న పంపిణీ చేయాలని భావించినా వీలు కాలేదు. చివరకు శుక్రవారం రోజునే పంపిణీ జరుగుతోంది.

నియోజకవర్గాల వారీగా పంపిణీ..

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచే పోడు పట్టాల పంపిణీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నిర్వహిస్తారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలందరూ ఆసిఫాబాద్‌కు వెళ్తుండడంతో ఈ రోజు ఆసిఫాబాద్ నియోజకవర్గం తప్ప మిగిలిన తొమ్మిది నియోజకవర్గాల్లో పంపిణీ జరగడం లేదు. ఎమ్మెల్యేల షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల వారీగా అర్హులకు ప్రత్యేక సభలు నిర్వహించి పట్టాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు ఇప్పటికే పంపిణీ చేయాల్సిన పట్టా పాస్‌బుక్‌లు జిల్లా రెవెన్యూ అధికారుల వద్దకు చేరాయి.

గిరిజనేతరులకు లేనట్లే?

అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు మాత్రమే పోడు హక్కులు కల్పించే అవకాశం ఉండడంతో వారికి మాత్రమే ప్రస్తుతం పట్టాలు అందజేస్తున్నారు. పోడు దరఖాస్తుల్లో గిరిజనేతరులవే అధికంగా వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 33వేల మంది గిరిజనులు, 1.24లక్షల ఎకరాలకు పోడు హక్కుల కోసం వినతులిచ్చారు. 32వేల మంది వరకు గిరిజనేతరులు 1.02లక్షల ఎకరాలకు దరఖాస్తులు ఇచ్చారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి పోడు కమిటీలు దరఖాస్తులు పరిశీలించి అటవీ, రెవెన్యూ, పంచాయతీ శాఖల పరిశీలన తర్వాత తుది జాబితాను సిద్ధం చేశారు. ఇందులో గిరిజనేతరులకు పోడు హక్కుల పట్టాలు ఇవ్వడం లేదు.

నేడు జిల్లాకు సీఎం

- కేసీఆర్ పర్యటనకు సర్వం సిద్ధం
- కొత్త కలెక్టరేట్, జిల్లా పోలీసు, బీఆర్ఎస్ కార్యాలయాలు ప్రారంభం
- ఇక్కడి నుంచే పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం
- కుమురం భీం, కోట్నాక భీంరావు విగ్రహాల ఆవిష్కరణ
- ఆసిఫాబాద్ పట్టణంలో భారీ బహిరంగ సభ



జిల్లా కేంద్రంలో ముస్తాబైన సభాస్థలి



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం

సాక్షి, ఆసిఫాబాద్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమురంభీం జిల్లా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. రెండు రోజులుగా రేయింబవళ్లు కష్టపడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వం సిద్ధం చేశారు. ఐదేళ్ల తర్వాత జిల్లాకు వస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆసిఫాబాద్‌కు రానున్న సీఎం కేసీఆర్ తొలుత కుమురం భీం చౌక్‌కు చేరుకుంటారు. అక్కడ కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించి ఆయనకు నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకుని పూజలు నిర్వహించి ప్రారంభిస్తారు. తరువాత పక్కనే ఉన్న పిల్లల పార్కుకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి ఆ భవనాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సమీకృత కలెక్టరేట్ సముదాయానికి చేరుకుంటారు. అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించి కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బందితో మాట్లాడుతారు. తరువాత కలెక్టరేట్‌లోనే దశాబ్దాలుగా పోడు భూములను సాగు చేస్తున్న గిరిజన రైతులకు పట్టాలు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 12 మంది గిరిజన రైతులకు సీఎం చేతుల మీదుగా హక్కుపత్రాలను అందజేస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభాస్థలికి చేరుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. తిరిగి 5 గంటలకు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు పయనమవుతారు.

ఆరెకరాల్లో బహిరంగ సభ..

సీఎం కేసీఆర్ పర్యటనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా జైలు సమీపంలోని ప్రేమలా గార్డెన్ వద్ద ఆరెకరాల్లో బహిరంగ సభకు కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ముఖ్యమంత్రితోపాటు పార్టీ ముఖ్యనేతలందరూ కూర్చునేలా భారీ వేదిక సిద్ధం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్ తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ, మండల, పట్టణాల నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు పార్టీ సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు సన్నద్ధమవుతున్నారు. వేదిక వద్ద మహిళల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీటి కోసం వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేశారు. అలాగే వారికి భోజనాలు మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

2,300 మందితో బందోబస్తు..

సీఎం పర్యటనకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. డీఐజీ రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, కరీంనగర్ పీటీసీ ఎస్పీ అరవింద్‌తోపాటు 15 మంది అడిషనల్ ఎస్పీలు, 49 మంది సీఐలు, 159 మంది ఎస్సైలు, 12 మంది మహిళా ఎస్సైలు, 264 మంది ఏఎస్సైలు, 1,100 మంది పీసీలు, 109 మంది మహిళా పీసీలు, 200 మంది స్పెషల్‌పార్టీ సిబ్బంది, హోంగార్డులు, 300 మంది సీఎం సెక్యూరిటీ, స్పెషల్ స్క్వాడ్ సిబ్బందితో మొత్తం 2,300 మందితో బందోబస్తు నిర్వహించనున్నారు.

పర్యటన ఇలా..

ఉదయం..
10.55 : ప్రగతిభవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.
11.00 : బేగంపేట విమానాశ్రయం నుంచి హెలీక్యాప్టర్‌లో ఆసిఫాబాద్ బయల్దేరుతారు.
మధ్యాహ్నం
12.05 : ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
12.15 : కుమురంభీం చౌక్‌లోని కుమురంభీం విగ్రహావిష్కరణ.
12.35 : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.
1.10 : పిల్లల పార్కులో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహావిష్కరణ.
1.30 : జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.
2.00 : సమీకృత కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభిస్తారు. పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేస్తారు. అక్కడ భోజనం చేశాక కలెక్టరేట్ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు.
4.00 : బహిరంగ సభ
సాయంత్రం..
5.00 : కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని హెలీక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు పయనం.
6.15 : బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.
6.25 : బేగంపేట నుంచి ప్రగతిభవన్‌కు చేరుకుంటారు.

మొక్కలతోనే జీవకోటికి మనుగడ



మొక్క నాటుతున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): మొక్కల పెంపకంతోనే జీవకోటికి మనుగడ ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. గోలేటి సీహెచ్‌పీలో గురువారం హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం తన వంతు బాధ్యతగా కోట్లాది మొక్కలు నాటుతోందన్నారు. బెల్లంపల్లి ఏరియాలో గతేడాది సుమారు 7లక్షల మొక్కలు నాటగా, ఈ ఏడాది లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, ఏజీఎం తిరుమల్‌రావు, సీహెచ్‌పీ డీజీఎం భీంరావ్ జాడే, ఈఈ రాజు, పిట్‌కార్యదర్శి మెరుగు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరం..





సాక్షి, ఆసిఫాబాద్: అడవుల ఖిల్లా కుమురం భీం జిల్లా కేంద్రంలో అద్భుతమైన ఆకృతితో నిర్మించిన సమీకృత కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాలను శుక్రవారం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. మొత్తం 22 ఎకరాల స్థలంలో జీ+2 పద్ధతిన 1.39 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో కలెక్టరేట్‌ను నిర్మించారు. ఇందుకోసం రూ.52.20 కోట్లు వెచ్చించారు. ఈ భవనంలో 37 శాఖల కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. అదేవిధంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని 18 ఎకరాల్లో సుమారు రూ.25 కోట్ల అంచనా వ్యయంతో 45వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+3 పద్ధతిలో నిర్మించారు. ఇందులో మొత్తం 50 వరకు విశాలమైన గదులు ఉన్నాయి.

క్లుప్తంగా

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య


చౌదరి జయరాం(ఫైల్)

బెజ్జూర్: మద్యానికి బానిసై ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం.. మండలంలోని కృష్ణపెల్లి గ్రామానికి చెందిన చౌదరి జయరాం(48) కొన్నిరోజులుగా మద్యానికి బానియ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో గురువారం వేకువజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నానాబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వాహనాల అద్దె పెంచాలి


ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎంకు వినతిపత్రం ఇస్తున్న అద్దె వాహనాల యజమానులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మార్కెట్ ధరలకు అనుగుణంగా సింగరేణి ప్రైవేటు వాహనాల అద్దెలను పెంచాలని వాహనాల యజమానులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎస్వోటూజీఎం ఉమాకాంత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా వాహనాల అద్దెలు పెరగకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. డ్రైవర్ల వేతనాలు, వాహనాల నిర్వహణ, పెరిగిన డీజిల్ ధరలకు అనుగుణంగా వాహనాల టెండర్లను పిలవటం లేదని అన్నారు. సీఎంపీఎఫ్‌ను పూర్తిగా రద్దు చేయాలని, వాహనాల టెండర్ ఆర్డర్ యూనిట్ రేట్ కాలంలో డ్రైవర్ జీతం, నిర్వహణ, డీజిల్ ప్రతి అంశాన్ని స్లాబ్ రేట్ వివరాలను వివరంగా పొందుపర్చాలన్నారు. అద్దె వాహనాల యూనిట్ రేట్‌ను పెంచాలన్నారు. సింగరేణి అద్దె వాహన యజమానులు సంఘం అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

'అభివృద్ధి అంటే భవనాలు నిర్మించడం కాదు'

ఆసిఫాబాద్‌అర్బన్: అభివృద్ధి అంటే పెద్దపెద్ద భవనాలు నిర్మించడం కాదని, జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి సీఎం కేసీఆర్ హామీఇవ్వాలని లేకపోతే అడ్డుకుంటామని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యాం, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆఫీస్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో గుండి వంతెన, ఇందాని, తిర్యాణికి రహదారులు, డబుల్‌బెడ్రూంలు నిర్మించాలని పేర్కొన్నారు. జోడేఘాట్‌లో ఆదివాసీలకు 50 ఇళ్లు మంజూరు చేస్తే ఇప్పటి వరకు బిల్లులు రాలేవని తెలిపారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బీబ్రాలో ఎక్కాహం

దహెగాం: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని బీబ్రా గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఎక్కాహం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పాల్గొని భజన చేస్తున్నారు. ఎక్కాహం శుక్రవారంతో ముగుస్తుందని గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు పూజలు చేశారు.

వ్యూహం అనుసరిస్తే విజయం మీదే..

- రేపే గ్రూప్–4 పరీక్ష...
- ఉమ్మడి జిల్లాలో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఉద్యోగాలకు తీవ్ర పోటీ...
- ప్రశాంతంగా రాస్తే కొలువు సులువేనంటున్న నిపుణులు

వివరాలు:
పరీక్ష : జూలై 1న శనివారం
పేపర్ 1: ఉదయం 10:00 నుంచి 12:30 వరకు
పేపర్ 2: మధ్యాహ్నం 2:30 నుంచి 5:00 వరకు


నిర్మల్ జిల్లా కేంద్రగ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు(ఫైల్)

నిర్మల్ ఖిల్లా: సాధారణ డిగ్రీ అర్హత గలిగిన జిల్లా స్థాయి పోస్టుల్లో అత్యంత కీలకమైనవి గ్రూప్–4 ఉద్యోగాలు. వీటి కోసం టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. శనివారం నిర్వహించే గ్రూప్ 4 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష ఉదయం పేపర్ 1, మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహించనున్నారు. సరైన వ్యూహంతో పరీక్ష రాస్తే ప్రభుత్వ కొలువును ఈజీగాసాధించవచ్చని పోటీ పరీక్షల నిపుణులు పేర్కొంటున్నారు.

8,039 పోస్టుల భర్తీ..
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 25 శాఖల్లోని మొత్తం 8,039 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయగా నిర్మల్ జిల్లాకు దాదాపు 200, రాష్ట్ర స్థాయి కోటాలో మరో 375 ఉద్యోగాలకు ఆయా శాఖల వారీగా పోటీపడే అవకాశం ఉంది. సాధారణ డిగ్రీ అర్హత కలిగిన ఈ గ్రూప్ 4 పరీక్షకు పీజీ, బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ తదితర ఉన్నత చదువులు అభ్యసించిన అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా వెలువడిన గ్రూప్ 4 నోటిఫికేషన్‌కు తీవ్రమైన పోటీ నెలకొంది.

గ్రూప్ 4 పరీక్ష ఇలా..
గ్రూప్ 4 పరీక్ష రెండు పేపర్లుగా 300 మార్కులకు ఉంటుంది. పేపర్ 1 జనరల్ స్టడీస్ 150 మార్కులకు, పేపర్ 2 సెక్రటేరియట్ ఎబిలిటీస్ 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల సమయం ఉంటుంది. పరీక్షలో వచ్చిన మెరిట్ ప్రతిపాదికన రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి మెరిట్ రూపొందించి అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.

ఉమ్మడి జిల్లా వివరాలు...

జిల్లా	అభ్యర్థుల సంఖ్య	పరీక్షకేంద్రాల సంఖ్య	పరీక్ష కేంద్రాలు
నిర్మల్	15,475	54	నిర్మల్, భైంసా, ఖానాపూర్
ఆదిలాబాద్	17,771	54	ఆదిలాబాద్, మావల, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్
మంచిర్యాల	27,801	94	మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట, నస్పూర్, జైపూర్
కుమురంభీం	8,251	33	ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, వాంకిడి, సిర్పూర్(టి), రెబ్బెన

పరీక్షకు ముందు రోజు..

- పరీక్షకు ఒక రోజు ముందు అభ్యర్థులు సబ్జెక్టు ప్రిపరేషన్ కంటే పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి. పరీక్షకు ఒక రోజు ముందు రాత్రి అభ్యర్థులు ప్రశాంతంగా నిద్రపోవాలి.
- పరీక్ష రోజున నిర్దేశిత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- కేటాయించిన స్థలం సరిచూసుకుని కూర్చున్న అనంతరం ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌ని చెక్ చేసుకోవాలి.
- సమాధానాలను గుర్తించే ముందు ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి.
- సులభమైన ప్రశ్నలతో ప్రారంభించి ఓ మోస్తారు కాఠిన్యత, ఆ తర్వాత మరింత కాఠిన్యత ఉన్న ప్రశ్నలకు సమాధానం గుర్తించాలి.
- తెలిసిన సమాధానాలకు గుర్తించిన తర్వాతనే ఎలిమినేషన్ విధానాన్ని, ఊహించి జవాబులు చేసే విధానాన్ని అనుసరించాలి.
- గ్రూప్ 4 మొదటి పేపర్ ముగిసిన తర్వాత రెండవ పేపర్ ప్రారంభానికి ముందు మధ్యాహ్నం రెండు గంటల వ్యవధి ఉంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు మొదటి పేపర్లో గుర్తించిన సమాధానాల గురించి చర్చించడం వంటివి చేయడం కరెక్ట్ కాదు. దీంతో అదనపు ఒత్తిడి పెరుగుతుంది.

ఒత్తిడికి గురికావొద్దు



పరీక్ష రోజున ఉదయం మొదటి, మధ్యాహ్నం రెండవ పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయంలో అభ్యర్థులు ఒత్తిడికి లోను కావొద్దు. తెలిసిన సమాధానాలు మొదటగా గుర్తించాలి. తెలియనివి ఉంటే వదిలేసి ముందుకెళ్లాలి. ఒకటి రెండు ప్రశ్నలకు సమాధానాలు తెలియకపోయినా ఆందోళన వద్దు. రెండు పేపర్లలో సాధ్యమైనన్ని ఎక్కువ మార్కులు సాధించేలా ప్రయత్నించాలి.

– కటకం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పోటీ పరీక్షల నిపుణులు, నిర్మల్

8 నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటన

కాగజ్‌నగర్‌టౌన్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జులై 8 నుంచి 15వ తేదీ వరకు కాగజ్‌నగర్‌లో పర్యటించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు ప్రవీణ్‌కుమార్ వస్తున్నట్లు తెలిపారు. గడప గడపకూ బీఎస్పీలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజలతో కలుస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు తరలిరావలని కోరారు.

'ఇది ముమ్మాటికీ కార్మికుల విజయం'

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే సింగరేణిలో పని చేస్తున్న అద్దె వాహనాల డ్రైవర్లు, కన్వెయన్స్ డ్రైవర్లతోపాటు కోల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు సీఎంపీఎఫ్ రికవరీకి సర్క్యులర్ వచ్చిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇది ముమ్మాటికి కార్మికులు సాధించిన విజయం అని పేర్కొన్నారు. జీవో నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని, సింగరేణి ఆర్జించిన లాభాలను ప్రకటించి కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలని ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

పేపర్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలో ఏకైక పరిశ్రమగా కొనసాగుతున్న సిర్పూర్ పేపర్ మిల్లు (జేకే మిల్లు)లో స్థానికులకు ఉపాధి కల్పించేందుకు యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదేలు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. మిల్లు పునఃప్రారంభమైనప్పుడు స్థానిక ఎమ్మెల్యే కాంట్రాక్టు కార్మికులకు రూ.35 వేల చొప్పున మంజూరు చేయిస్తామని ఇచ్చిన హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆసిఫాబాద్ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.


రెబ్బెన మండలం మహంకాళి ఆలయంలో..


సిర్పూర్(టి): వేంకటేశ్వర ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

రెబ్బెన/కెరమెరి/కౌటాల/పెంచికల్‌పేట్/సిర్పూర్(టి)/బెజ్జూర్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలతో మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. రెబ్బెన మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి, కెరమెరి మండలకేంద్రంలోని శివాలయం, జైనూర్ మండలంలోని విఠల్ రుక్మాయి, సిర్పూర్(టి)లోని మండలంలోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

పోడు రైతులందరికీ పట్టాలివ్వాలి

కాగజ్‌నగర్‌టౌన్: పోడు వ్యవసాయం చేసుకుంటున్న ప్రతీ రైతుకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014, 2018 ఎన్నికల సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ పోడు రైతులందరికీ పట్టాలు ఇస్తామన్న కేసీఆర్ కేవలం ఎస్టీ సామాజిక వర్గంలో కొద్దిమందికి మాత్రమే పట్టాలిచ్చి చేతులు దులుపుకుంటున్నారని దుయ్యబట్టారు. హామీ నెరవేర్చే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతోందని స్పష్టం చేశారు. అలాగే పేపర్ మిల్లులో పర్మినెంట్ కార్మికులకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కాంట్రాక్టు కార్మికుల పరిహారం చెల్లించాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు విశ్వేశ్వర్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీసీలకు పోడు పట్టాలివ్వాలి
ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం కేసీఆర్ గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడం సంతోషకరమని, అదేవిధంగా బీసీలకు కూడా పోడు పట్టాలు పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ రైతు సంఘం జిల్లా వైరాగడే మారుతి కోరారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బీసీ వర్గానికి చెందిన రైతులు ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకుంటున్నారని తెలిపారు.


కెరమెరిలో..


కాగజ్‌నగర్‌టౌన్: సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు

ఘనంగా బక్రీద్

బక్రీద్ వేడుకలను జిల్లావ్యాప్తంగా ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని (ఈద్‌ముబారక్) శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగజ్‌నగర్‌లోని ఈద్గా వద్ద సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వంశీలు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాగజ్‌నగర్‌లో డీఎస్పీ ఎ.కరుణాకర్ ఆధ్వర్యంలో సీఐ బుద్దే స్వామి ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


దహెగాం: బీబ్రా ఈద్గా వద్ద..


ఆసిఫాబాద్: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ మల్లికార్జున్


సిర్పూర్(టి): లోనవెల్లి గ్రామంలో ప్రార్థనలు


చిన్నారుల ఆలింగనం

జనసమీకరణకు సన్నాహాలు

- గులాబీమయమైన జిల్లా కేంద్రం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం తలపెట్టిన సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు కసరత్తు చేస్తున్నారు. గత వారం రోజులుగా జనసమీకరణ, ఏర్పాట్లపై జిల్లా నాయకులు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఒడేపెల్లి గార్డెన్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించి ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం కేసీఆర్ మూడోసారి జిల్లాకు రానున్నారు. జిల్లావ్యాప్తంగా సీఎం బహిరంగ సభకు 60 వేల మంది జనసమీకరణే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్‌ల నుంచి ఒక్కో నియోజకవర్గం నుంచి 30 వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు అదే పనిలో ఉన్నారు. ప్రత్యేక బస్సులు, ఐచర్ వ్యాన్లు, ఆటోలను సమకూరుస్తున్నారు. శుక్రవారం బహిరంగ సభకు వచ్చిన వారికోసం ఏఎంసీ కార్యాలయం, శివాజీ భవన్, టాటియా గార్డెన్‌ల వద్ద భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఇన్‌చార్జీలను నియమించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. సభకు వచ్చిన వారికి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు కేటాయించారు.

రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు


అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు బీఆర్ఎస్ నేతల ఫ్లెక్సీలతో గులాబీమయమైంది. చెక్‌పోస్టు నుంచి అంబేద్కర్ చౌక్, కుమురంభీమ్ చౌక్, కలెక్టర్ రోడ్, జన్కాపూర్ రోడ్‌తోపాటు కలెక్టరేట్ రహదారిపై ఇరువైపులా సీఎంకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సీఎం భద్రత నేపథ్యంలో ఉమ్మడి జిల్లాతోపాటు కరీంనగర్, నిజామాబాద్‌కు చెందిన పోలీసు బలగాలు గురువారం ఇక్కడకు చేరుకున్నారు.

రెబ్బెన(ఆసిఫాబాద్)/కౌటాల: ఆసిఫాబాద్‌లో శుక్రవారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. గురువారం గోలేటి సీహెచ్‌పీలో పని చేస్తున్న సింగరేణి ఉద్యోగులను కలిసి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. టీబీజీకేఎస్ నాయకులు సంపత్, మేరుగు రమేష్, సమ్మయ్య, మహేందర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు. ఏళ్లుగా పోడు భూముల పట్టాల సమస్యను సీఎం కేసీఆర్ పరిష్కరించి నేడు పట్టాల పంపిణీకి వస్తున్నారని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్‌గౌడ్ అన్నారు. కౌటాలలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు.

సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో మంత్రి ఐకేరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పలకు పద్మశాలీ సేవాసంఘం, గ్రామపంచాయతీ కార్మికులు గురువారం వినతిపత్రాలు అందజేశారు. మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ, సామల సదాశివల కాంస్య విగ్రహాల ఏర్పాటుకు కేసీఆర్‌తో ప్రకటన చేయాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి అశోక్ కోరారు. కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులను ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుడు లోకేశ్, ఉపేందర్ కోరారు.


మంత్రి ఐకేరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

సర్దార్‌బస్తీలో మహాజన్ సంపర్క్ అభియాన్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్దార్‌బస్తీలో శక్తి కేంద్ర ఇన్‌చార్జి శ్రీమతి రాణి ఆధ్వర్యంలో మహాజన సంపర్క్ అభియాన్ కింద బీజేపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ 9 ఏళ్ల ప్రధాని మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి
కెరమెరి: గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతం చేయాలని ఆ పార్టీ విస్తారక్ చంతకుంట విఠొబా అన్నారు. మండల కేంద్రంలో గురువారం కార్యకర్తలతో మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రామ్‌రావు మహరాజ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు వెంకటి, రాజు, వేణుగోపాల్, రాథోడ్ సాగర్, చందునాయక్, నవీన్‌కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.


దహెగాం: కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీకి మద్దతు తెలపాలి
దహెగాం: పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న బీజేపీకి మద్దతు తెలపాలని మండల అల్పకాలిక విస్తారక్ భార్గవరెడ్డి అన్నారు. మేరాబూత్ సబ్‌సే మజ్బూత్ లో భాగంగా మండల కేంద్రంలో గడప గడపకూ వెళ్లి కేంద్ర పథకాలను వివరించారు. ధనుంజయ్, సత్యనారాయణ, సురేష్, మహేష్, మల్లేశ్, సంజీవ్, ప్రదీప్ పాల్గొన్నారు.

రేపు శని త్రయోదశి పూజలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పోచమ్మ బస్తీలో గల శని మందిరంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పండితుడు నందకిశోర్ జోషి పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.